Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

సుందరరామయ్య, క్రొత్తపల్లి

వైద్యప్రస్తారము

రాజమహేంద్రవరము, 1920

Record no. 205

Sundararāmayya, Krottapalli

Vaidyaprastāramu

Rājamahēndravaramu, 1920

Record no. 205

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

సుందరరామయ్య, క్రొత్తపల్లి.

వైద్యప్రస్తారము / క్రొత్తపల్లి సుందరరామయ్యగారిచే రచియింపఁబడి; కాసంశెట్టి శేషగిరిరావుచే ప్రకటింపఁబడినది.- 1. కూర్పు.- రాజమహేంద్రవరము : విద్యానిలయముద్రాక్షరశాల, 1920.

42 p. ;22 cm.

Record no. 205

Sundararāmayya, Krottapalli.

Vaidyaprastāramu / Krottapalli Sundararāmayyagāricē raciyimpam̐baḍi; Kāsam̐śeṭṭi Śēṣagirirāvucē prakaṭimpam̐baḍinadi.- 1. kūrpu.- Rājamahēndravaramu : Vidyānilayamudrākṣaraśāla, 1920.

42 p. ;22 cm.

Record no. 205

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB   Date filming began:

సారస్వత నికేతనము

వేటపాలెం

పుస్తకము పేరు వైద్యప్రబోధము

గ్రంధకర్త K. సుందరరామయ్య

పుస్తకము సంఖ్య 1684 వర్గ సంఖ్య

615.534

సుం 3 - వై

1684

1684

సారస్వత నికేతనము, వేటపాలెం.

615.89 .M0

గ్రంథసంఖ్య. 1684

యీగ్రంథమును యిందుక్రింద కడపటిదిగా యుండు తేదీలోపల వాపసుయివ్వవలెను.

1684

శ్రీ

వైద్యప్రస్తారము.

ఇది

వ్రణచికిత్స, దంతశోధని, ఆరోగ్యదర్పణము

మొదలయిన వైద్యగ్రంథములను

రచించిన

బ్ర॥ కొత్తపల్లి సుందరరామయ్యగారిచే

రచియింపఁబడి

బుక్కు-సెల్లర్

కానంశెట్టి శేషగిరిరావుచే

ప్రకటింపఁబడియె.

(మొదటికూర్పు 1,000 ప్రతులు.)

విద్యానిలయముద్రాక్షరశాలన్ముద్రితము.

రాజమహేంద్రవరము.

1920

ఆల్ రైట్సు రిజర్వుడు] [వెల రు 0—8—0 లు.

Saraswata Niketanam. Acc. No. Vetapalem.

615.89
Mo

శ్రీ

వైద్యప్రస్తారము

శా. సంతానంబును నిందిరారమణియుం జౌదంతియావున్నిశా
కాంతుండు న్వరకౌస్తుభంబమృతముం గ్రమంపుతోఁబుట్టువై
వింతల్గులక్కఁగ మూఁడులోకములలో విఖ్యాతిఁగన్నట్టి ధ
న్వంతర్యాఖ్యభిషక్ఛిఖామణిమమున్ రక్షించు నెల్లప్పుడున్. 1

తా. కల్పవృక్షమును, శ్రీమహాలక్ష్మియు, ఐరావతమును, చంద్రుండును, కౌస్తుభంబును, తోఁబుట్టువులై మూఁడులోకముల యందును ప్రఖ్యాతినిగాంచిన ధన్వంతరి యను దేవవైద్యశిఖామణి యెల్లప్పుడును మమ్ము రక్షించుఁగాక.

గీ. పారిజాతకుసుమ సౌరభంబుఁ గొనుచు
దివ్యమణిమయదీప సందీప్తిఁగనుచు
నమృతముందినుచు నమృతహస్తుఁడైన
విబుధధన్వంతరికి వేనవేలునతులు. 2

తా. పారిజాతపుష్పముల సువాసననాఘ్రాణించుచు, దేవతా సంబంధమగు మణిదీపకాంతులతో విరాజిల్లుచు, అమృతభక్షణము సేయుచు, అమృతహస్తుఁడైన దేవతాధన్వంతరికి అనేకవేల నమస్కారములు.

మ. పొగడన్‌శక్యముగాని వర్తనమునం బొల్పొంది, శాస్త్రంబు వా
సిఁగనన్ స్వచ్ఛపునౌషధంబుల లసచ్చిత్తంబునం జేసి రో

గగణంబుందొలఁగించి దేహులకు సౌఖ్యంబిచ్చియున్నట్టి యా
యగదంకారులకెల్ల జోతలను నేనర్పింతు నశ్రాంతమున్. 3

తా. నుతింపశక్యముగాని నడత చేనొప్పి, శాస్త్రమునకుఁ బేరువచ్చునట్లు గొప్పమందులను మంచిబుద్ధితోఁ జేసి సర్వరోగములం బోఁగొట్టి మనుజుల కారోగ్యమొసంగియున్న ప్రసిద్ధులగు వైద్యుల కందఱికి నేనెల్లప్పుడు నమస్కరించుచుందును.

సీ. అవని బ్రజల కత్యంతోపయోగమా
వ్రణచికిత్సనొనర్చి వ్రాసిఁగంటి
వనువైన దంతశోధని రచియించి వై
ద్యవరులచేఁ గీర్తి నందియుంటి
వఖిలజనామోదమైన యారోగ్యద
ర్పణమునుగావించి గణుతిఁగంటి
విపుడు వైద్యమునందు నిపుణతఁగైకొను
నానంద మెల్లర కమరనిమ్ము
గీ. సర్వశాస్త్రప్రవీణుఁడై సన్నుతిఁగను
నాదినారాయణాంశజుఁడైనయట్టి
యాదిశేషుండు నీకండయనెడుభంగి
నిపుడు శేషాంశజుని దైవ మిచ్చెనీకు. 4

తా. సకలజనులకు మిగుల యుపయోగమయిన వ్రణచికిత్స యనుగ్రంథమును జేసి వ్రాసిఁగాంచితివి, చక్కని దంతశోధని యను పుస్తకము వ్రాసి వైద్యవర్యులచేఁ గీర్తింపఁబడితివి, సర్వజనుల కామోదముంగలిగించు, ఆరోగ్యదర్పణమను పొత్తమును రచియించి యెన్నికంగొంటివి. వైద్యమునందు నేర్పరులగుట కాసక్తిగలుగునట్లు నివ్వ డెల్లవారికిని సంతోషమును గలుగఁజేయుము. (అనఁగా నట్లు

చేయు గ్రంథమును రచియింపుమని) సకలశాస్త్రములెఱింగి పొగడుఁగనుట్టియు, ఆదినారాయణుని యంశమునం జన్మించినవాఁడును నైనట్టి, ఆదిశేషుండు నీకాధారముగ నుండునని చెప్పునట్లు, ఇపుడు శేషాంశసంభూతుఁడగు శేషుని (అనఁగా బ్రll కందుకూరి శేషయాఖ్యుని) నీకు దైవము సాయముగా నొసంగెను.

ఉ. కావున నుత్తమంబయిన గ్రంథము వ్రాసి జనంబులెల్ల నెం
తేవినుతింప లోకమున నిల్వుమటంచు సుహృద్గణంబు సం
భావనఁ జేసి పల్కుటను వల్లెయటంచు రచింపఁబూనితిన్
భావమునందు లోకములు భావుకతం గనుపొందె వేడుకన్. 5

తా. కాఁబట్టి శ్రేష్ఠమైన గ్రంథమును వ్రాసి జనఁబు మిక్కిలికొనియాడ లోకమున నిల్వుమని మిత్రవరులు గౌరవముగఁ బల్కుటం జేసి మంచిదియని వేడ్కతో సర్వలోకములును మంగళములం గాంచుచుండుటకై హృదయమున రచియింపనెంచితిని.

క. సారంబగు వైద్యప్ర
స్తారంబు జనాళులకు ముదంబొసఁగును వి
స్తారంబు, దీనిఘనఫల
సారంబు నెఱుంగఁగలరు చక్కగ జనముల్. 6

తా- సారవంతమగు వైద్యప్రస్తారమను నీగ్రంథము జనములకు మిక్కిలి సంతోషమును గలుగఁజేయును- దీనివలనంగలుగు ఫలము నెల్లరుం జక్కఁగాఁ దెలిసికొందురుగాక!

వైద్యగ్రంథరచనాదికము.

క. ఘనకల్యాణగుణాకరుఁ
డును ఘనకరుణార్ద్రహృదయుఁడును లోకేశుం
డును నగువిధి తాను సృజిం
చినప్రాణుల దేహసౌఖ్యసిద్ధిఁ దలఁచుచు మున్. 7

తా. మంగళప్రదమగు గుణములచే నిండినవాఁడును, మిక్కిలి దయతోఁగూడిన హృదయముఁగలవాఁడును, లోకమునకధిపతియునగుబ్రహ్మ తానునిర్మించిన ప్రాణికోటికి శరీరారోగ్యసిద్ధింగూర్చి యాలోచించినవాఁడై.

సీ. కాయచికిత్సయుఁ గౌమారభృత్యంబు
నగదతంత్రంబు శల్యమును భూత
విద్య శాలాక్యము విపులరసాయన
తంత్రవాజీకృత తంత్రములను
నెనిమిది తెఱఁగుల నెసఁగునాయుర్వేద
శాస్త్రము రచియించి సర్వమర్త్య
సంరక్షణార్థమై క్షుకుఁ దనకుంగూర్మి
తనయుఁడైయొప్పెడు దక్షునకును
గీ. సర్వముపదేశమొనరించె సరగ దక్షుఁ
డర్యమకుమారులయి ఖ్యాతినందినట్టి
యశ్వినీదేవతలకును నాశ్వినేయు
లెలమి నింద్రునకుం జెప్పి రిద్ధగతిని. 8

తా. కాయచికిత్సయు, కౌమారభృత్యమును, అగదతంత్రమును, శల్యమును, భూతవిద్యయు, శాలాక్యమును, రసాయన

తంత్రమును, వాజీకరణతంత్రమునను, ఎనిమిదిభాగములుగల యాయుర్వేదమునుజేసి సర్వమానవులను రక్షించునిమిత్తము తనకుమారుండగు దక్షప్రజాపతి కుపదేశించెను. ఆదక్షప్రజాపతి సూర్యపుత్త్రులగు నశ్వినీదేవతలకుఁ జెప్పెను. ఆయశ్వినీదేవత లింద్రునకుంజెప్పిరి.

గీ. వజ్రపాణి భారద్వాజవర్యునకు ము
దంబుతోఁ జెప్పెనతఁడు భూతలమునందు
బ్రహ్మనిర్మితవైద్యంబుఁ బ్రచురపరుపఁ
జిత్తముననెంచి కౌతుకాయత్తుఁడగుచు. 9

తా. ఇంద్రుండు భారద్వాజునకుఁ జెప్పెను- భారద్వాజుండు బ్రహ్మచేరచియింపఁబడిన యాయుర్వేదమును భూమియందుఁ బ్రచురమగుటకై సంతోషమున మనస్సునందెంచి.

గీ. జాతుకర్ణ, పరాశర, చరక, భేడ,
సుశ్రు, తాత్రేయ, ధన్వంతరి, శ్రుతిప్ర
వీణులకు మఱియును నగ్నివేశునకును
వేడ్కనుపదేశమొనరించి విఖ్యాతిఁగాంచె 20

తా. వేదవిదులగు జాతుకర్ణునకు, పరాశరునకు, చరకునకు, భేడునకు, సుశ్రుతునకు, ఆత్రేయునకు, ధన్వంతరికి, అగ్నివేశునకు, ఉపదేశముచేసి ప్రఖ్యాతిం గాంచెను.

ఉ. ఈపరమర్షివర్యులు మహేడ్యమునైతగు వైద్యశాస్త్రవి
ద్యాపరిపూర్ణులై యనుభవామితశోభితపూతచిత్తులై
యేపుగ వేఱువేఱ రచియించిరిక్షేమజకావ్యరాజముల్
ప్రాపయి యెల్లమానవులఁ బాలనసేయుతలంపుపుట్టుటన్. 11

తా. ఈఋషిశ్రేష్ఠులు ప్రశస్తమగు వైద్యశాస్త్రవిద్యచేఁదగినవారయి, అనుభవమువలన నెక్కుడవప్రకాశించు పవిత్రము

లైన హృదయములు గలవారై యెవరికివారు సమస్తజనులను బాలించు తలంపుతోఁ జక్కని వైద్యగ్రంథములను రచియించిరి.

ఉ. మెండుగ నశ్వినీసురలు మేదురబుద్ధిని దేవవైద్యులై
యుండి భయంకరంబగుచునుండినవ్యాధుల నెల్ల మాన్పి యు
ద్దండయశఃప్రశస్తులను దాల్చుచుఁ గాయచికిత్సమీఁదనుం
బాండితిశస్త్రభేషజము పై రచియించిరి పెక్కుగ్రంథముల్. 12

తా. అశ్వినీదేవతలు ఘనమైనబుద్ధితో దేవవైద్యులై భయంకరమగు రోగములనన్నిటిని మాన్పి గొప్పకీర్తిని బ్రతిష్ఠను వహించి కాయచికిత్సమీఁదను, శస్త్రచికిత్స మీఁదను, అనేకములగు గ్రంథములను రచించిరి.

గీ. వసుధ నాత్రేయుఁడను ఋషివల్లభుండు
తన రచియించినట్టి గ్రంథములలోన
నొక్కఁడాత్రేయసంహిత యురుతరప్ర
శస్తిఁగాంచెను భాగపంచకముతోడ. 13

తా. ఆత్రేయుఁడు రచించిన గ్రంథములలో నొకటి, ఆత్రేయసంహిత. ఇది యయిదుభాగములు గలిగి కడుఁబ్రశస్తినిగాంచెను.

గీ. అగ్నివేశకృతగ్రంథ మఖిలవైద్య
శాస్త్రకోవిదుఁడై యొప్పు చరకువలన
సవరణంగాంచి యయ్యది చరకసంహి
తయనఁ బ్రఖ్యాతిఁగాంచె భూతలమునందు. 14

తా. అగ్నివేశుఁడను ఋషివలన రచియింపఁబడిన గ్రంథము సర్వవిధ వైద్యశాస్త్రములయందును బండితుఁడగు చరకఋషి వలన సవరింపఁబడి భూమియందుఁ జరకసంహితయను పేరున నొప్పుచున్నది.

చ. చరకసమాఖ్యవైద్యకృతి స్థానములెన్మిది గల్గి నూటిపై
నిరువదిసంఖ్య సత్ప్రకరణేడ్యముగా సవరించి పెద్దగాఁ
జరకునిచేతఁ జేయఁబడి సర్వచికిత్సలఁగీర్తిఁగాంచె నా
తరణిశశాంకభూగగనతారకమై వెలుఁగొందుఁగావుతన్. 15

తా. చరకమనుపేరుగల వైద్యగ్రంథము శ్లోకస్థానము, కల్పస్థానము, సిద్ధిస్థానము, విమానస్థానము, శరీరస్థానము, ఇంద్రియస్థానము, చికిత్సాస్థానము, అనునెనిమిది భాగములు గలిగి నూటయిరువదియధ్యాయములుగా దిద్ది విపులముగాఁ జరకునిచే రచియింపఁబడి కాయచికిత్సాది సకలచికిత్సలయందు నుత్తమమైనదియై పేరుఁగాంచెను. సూర్యుఁడు, చంద్రుఁడు, భూమి, ఆకాశము, నక్షత్రములు నున్నంతకాలము నీగ్రంథరాజము ప్రకాశించును గాక!

గీ. కాశిరాజు దివోదాసుకడను వైద్య
శాస్త్రమును నేర్చి సుశ్రుతసంహితయను
గ్రంథరాజము రచియించి గణనకెక్కె
సుశ్రుతుఁడు విశ్రుతజ్ఞానశోభితుఁడయి. 16

తా. సుశ్రుతుఁడు మహాజ్ఞాన సంపన్నుఁడై దివోదాసుఁడను కాశీరాజుకడ వైద్యశాస్త్రమును నేర్చుకొని సుశ్రుతసంహితయను నుత్తమగ్రంథమును రచించి వినుతిఁగాంచెను.

క. నయశస్త్రచికిత్సాదివి
షయములను శరీరశాస్త్రసంగతులను నెం
తయు బోధించుట నుత్తమ
మయి యాతనిగ్రంథరాజ మవనిన్ వెలయున్. 17

తా. చక్కని శస్త్రచికిత్స మొదలగు విషయములను, శరీరశాస్త్రవిషయికమగు సంగతులను బాగుగా బోధించుటచేత శ్రేష్ఠ

మైన యా సుశ్రుతుని సుశ్రుతసంహితయను గ్రంథము భూమియం దొప్పెను.

గీ. అపరధన్వంతరియనంగ విపుల విపుల
కీర్తిఁదనరారె రోగులయార్తిఁదీర్చి
ఘనదివోదాసుఁడనఁగను గాశిలోన
వైద్య మొనరించుచుండె సంవేద్యుఁడగుచు. 18

తా. దివోదాసుఁడనుపేరుగల కాశీరాజు, ధన్వంతరి యవతారమయి జ్ఞానవంతుఁడయి రోగులరోగనిర్మూలనము సేయుచు భూమియందు విశాలమయిన కీర్తిని సంపాదించెను.

గీ. సుశ్రుతుఁడు తన యేడ్వురసోదరులను
గూడి తండ్రి విశ్వామిత్రగుణగరిష్ఠు
నాజ్ఞఁ దలఁదాల్చి వైద్యంబు నభ్యసించె
జనులకారోగ్యముం గూర్చ సంతసమున. 19

తా. సుశ్రుతుఁడు తండ్రియైన విశ్వామిత్రుని యాజ్ఞం దలఁదాల్చి తన యేడుగురసోదరులతోడం గూడి జనులకు, ఆరోగ్యముం గలిగించు తలంపుతో వైద్యశాస్త్రమును నేర్చుకొనెను.

క. గట్టిచికిత్సలఁ గ్రీస్తువు
పుట్టకమును జేసి కీర్తిఁబొంది ధర వా
గ్భట్టాచార్యుం డొనరిచె
నెట్టన నష్టాంగహృదయకృత్యుత్తమమున్. 20

తా. క్రీస్తుపుట్టకముందు వాగ్భట్టాచార్యుఁడు చక్కని వైద్యముచేసి ప్రఖ్యాతిం గాంచి, అష్టాంగహృదయమను నుత్తమగ్రంథమును రచించెను.

మ. తనకుం బూర్వులుచేసియుండినచికిత్సాగ్రంథరాజంబులం
గని తద్గ్రంథవిశేషముల్ గొని మహాకారుణ్యవృత్తిన్ భిష

గ్వనులానందనిమగ్నులై కొనర సద్గ్రంథంబుదీనిన్ జగ
జ్జనరోగాపహమై వెలుంగఁ గడునిచ్చం జేసి వాసింగనెన్. 21

తా. పూర్వవైద్యకవీంద్రులు చేసియుండిన వైద్యగ్రంథరాజములం గాంచి యందుఁగలవిశేషాంశములను గ్రహించి మిక్కిలి దయతో వైద్యశిఖామణు లానందమునమునుఁగఁగా గొప్పగ్రంథమగు నీయష్టాంగహృదయమను పుస్తకమును లోకమునంగల సర్వజనులరోగమును హరించునదిగా రచించి కీర్తిం గాంచెను.

గీ. మఱియు నష్టాంగసంగ్రహ మనెడుపేర
వేఱ యొక కబ్బమురచించి వినుతిఁగాంచె
నీఘనాచార్యుఁడు పరోపకృతివిశేష
కార్యసంతోషహృదయ సంకల్పుఁడగుచు. 22

తా. ఇంతియేగాక, ఈవాగ్భట్టాచార్యుండు పరోపకారహృదయముగలవాఁడై, అష్టాంగసంగ్రహమను నింకొక వైద్యగ్రంథమును గూడ విరచించి ప్రసిద్ధినొందెను.

క. జనములవిద్యారణ్యుం
డను పేరం బరగు మాధవాచార్యుఁడు చే
సెను రోగోత్పత్తియుఁ ద
ద్భవలక్షణముఁగల మాధవనిదానమ్మున్. 23

తా. ప్రజలయందు విద్యారణ్యుఁడను నామాంతరము గల మాధవాచార్యుఁడు రోగోత్పత్తియు, రోగలక్షణమును గల మాధవనిదానమను గ్రంథమును జేసెను.

గీ. పూర్వము ప్రసిద్ధిగాంచిన భూరివైద్య
కావ్యసముదాయమునుండి నవ్యమగు వి
షయములను సంగ్రహించి ప్రశస్తఫణితి
భావమిశ్రుఁడు విరచించె వైద్యకృతిని. 24

తా. పూర్వముపేరుఁబొందిన గొప్ప వైద్యగ్రంథములనుండి మిక్కిలి మంచిసంగతులను గొని చక్కనిమార్గమున భావమిశ్రుఁ డనుఋషి వైద్యగ్రంథమును రచించెను.

క. నవ్యప్రక్రియనీతని
కావ్యము భావప్రకాశ ఘననామమునన్
భవ్యమయి శ్రావ్యమయి కడు
నవ్యయఫలదాయకంబు నై ధర వెలసెన్. 25

తా. నూతనపద్ధతి నీభావమిశ్రునిగ్రంథము భావప్రకాశ మనుపేరుతో మంగళప్రదమును, వినసొంపుగలదియు, అతిశయఫల ములనిచ్చునదియు నై భూమియందుఁ బ్రకాశించెను.

ఉ. ఈతఁడు మద్రదేశమున నెంతయు వైద్యచికిత్సలందుఁ బ్ర
ఖ్యాతి వహించి కాశిఁ జిరకాలము వాసముఁజేసియుండి సం
ప్రీతిని శిష్యకోటులకు విద్యనునేర్పుచు సర్వకాలసం
జాతకుతూహలుండగుచు శాస్త్రవిమర్శనఁ గాలముంగొనెన్. 26

తా. ఈభావమిశ్రుఁడు మద్రదేశమున వైద్యశ్రేష్ఠుఁడను ప్రఖ్యాతింగాంచి కాశీక్షేత్రమునఁ జాలకాలము నివాసముగానుండి మిక్కిలిప్రేమతోఁ బెక్కురశిష్యులకు విద్యాభ్యాసముసేయుచు నెప్పుడు సంతోషముగలవాఁడై శాస్త్రవిమర్శనచేఁ గాలక్షేపమొన రించెను.

గీ. శార్ఙ్గధరసంహితయనంగ శార్ఙ్గధరుఁడు
వెలయ నిరువదియధ్యాయములుగ మిగుల
సర్వవైద్యోపయుక్తవిషయములఁగొని
చేసె వజ్ఞులుగాంచి సెబాసనంగ.

తా. శార్ఙ్గధరుఁడనుఋషి శార్ఙ్గధరసంహితయను గ్రంథరాజ మును సకలవైద్యుల కుపయుక్తమగు సంశములఁజేర్చి యిరువదియ ధ్యాయములుగ వైద్యులెల్లరుఁ గని మెచ్చుకొనరచించెను.

సీసమాలిక.

వైద్యామృతము నిరవద్యశక్తిని రచి
యించిన భట్టమోరేశ్వరుండు
వైద్యజీవనమును బరమోపకారియై
లలిఁజేసినట్టి లోలంబరాజు
ఘనఁజికిత్సాసంగ్రహము వేడ్కరచియించి
సన్నుతిఁ గాంచిన చక్రదత్తు
ఘనచక్రదత్తముక్తావళి యనుగ్రంథ
శస్తముల్ జేసిన చక్రపాణి
భువిఁ జికిత్సాసారమును రచియించి పే
ర్వడసిన మేటి గోపాలదాసు
అగ్నిపురాణవర్యము జగద్ధితముగ
వాసినొనర్చిన వ్యాససూరి
అమృతసాగరమును నమరంగ సృజియించి
ధన్యుఁడైయొప్పు ప్రతాపసింగు
గీ. వీరలేగాక పెక్కురుసారవంత
వైద్యకావ్యంబు లొనరించి వాసిఁగనిరి
గ్రంథకర్తలెకారు రోగములఁబాపు
ఘనభిషగ్వర్యులగుచును ఖ్యాతిగనిరి. 28

తా. వైద్యామృతమునురచించిన భట్టమోరేశ్వరుఁడును, వైద్యజీవనమునుజేసిన లోలంబరాజును, చికిత్సాసంగ్రహమును

రచించినచక్రిదత్తుఁడును, చక్రిదత్త, ముక్తావళి యనుగ్రంథములఁ జేసినచక్రపాణియు, చికిత్సాసారమును రచించి గోపాలదాసును, అగ్నిపురాణమున్నొనర్చినవ్యాసుఁడును, అమృతసాగరము ను సృజించినప్రతాపసింగును వీరేగాక చాలమంది వైద్యగ్రంథములనురచించి ప్రఖ్యాతిఁబొందుటయేగాక వైద్యశిఖామణులైకూడఁ బేరుగాంచిరి.

క. నయశస్త్రచికిత్సాదివి
షయముల సుశ్రుతము బోధసలుపఁదగు నెం
తయుఁ గాయచికిత్సాదివి
షయముల బోధింపఁదగును చరకముధాత్రిన్. 29

తా. శస్త్రచికిత్సలు మొదలైనవాని విశేషములను బోధించుటను సుశ్రుతసంహితయు, కాయచికిత్సమొదలైనవాని విశేషములనుబోధించుటకుఁ జరకసంహితయు నుత్తమమైనవి.

సీ. శాస్త్రరహస్యముల్ చక్కఁగాఁ దెలుప న
ష్టాంగహృదయము నష్టాంగసంగ్ర
హము, లక్షణము నిదానముఁ దెల్పుటకును మా
ధవనిదానంబును, నవరసముల
రసములందగు నుపరసముల లోహంబు
లను వీనిభేదంబులను సమేళ
నములను మఱిమారణము మున్నగునుపాయ
ములు రసరత్నసముచ్చయంబు
గీ. ను రసరత్నాకరంబును ధరణివెలయు
చున్న నాగార్జునీయంబు నెన్న బోధ
సేయుటకు సుప్రసిద్ధిని జెందియుండె
సకలవైద్యశిఖామణుల్ సన్నుతింప. 30

తా. శాస్త్రరహస్యములను దెలుపుటకు అష్టాంగహృదయము, అష్టాంగసంగ్రహమును, రోగలక్షణములను, రోగనిదానములను దెలుపుటకు మాధవనిదానమును, నవరసములను, రసములను, లోహములను, వీనిభేదములను, సమ్మేళనములను, మారణము, (అనఁగాభస్మములు) మొదలైనయుపాయములను బోధించుటకు రసరత్నసముచ్చయము, రసరత్నాకరము, నాగార్జునీయము, అనునవి యెల్లవైద్యులును స్తోత్రముచేయుఁగాఁ బ్రశస్తినిఁ గాంచియున్నవి.

వివిధాంశములు.

గీ. అధికముగ నీరుద్రావుట, యహమునందు
నిద్రఁజెందుట, నిశలను నిద్రలేక
యుంట, మలమూత్రములునాపుకొంట, మిగుల
దినుట, రోగంబులెల్లను వెంటనంటు. 31

తా. నీరు ఎక్కువగాఁద్రావుటచేతను, పగలునిద్రబోవుటచేతను, రాత్రులయందుమేలుకొనుటచేతను, మలమూత్రములనాపుకొనుటచేతను, మిగులఁదినుటచేతను సకలరోగములుఁబుట్టుచున్నవి.

గీ. వాతపైత్యకఫంబులు వైపరీత్య
మేయగును రోగ మవిమూఁడునెనఁగసమము
గాఁగనుండుట యారోగ్యగతిలభించు
నంచుఁబెద్దలువచియింతు రదినిజంబు. 32

తా. వాతము, పైత్యము, కఫము వీనియొక్కవిపరీతభావమే రోగము. ఆవాతపైత్యశ్లేష్మములు సమముగానుండుటయే యారోగ్యము.

క. ఆగంతుక నైసర్గిక
భావంబుల ద్వివిధములగుచు వర్తిలుచుండున్
రోగంబులు భూతలమున
యోగివరోదితములగుచు నొప్పగనెందున్. 33

తా. రోగములు, నైసర్గికములును, ఆగంతుకములునని రెండు విధములుగలవియని ఋషిశ్రేష్ఠులు చెప్పుదురు.

గీ. వ్యాధులుశరీరసంబంధమైనవియగు
నాధులవియాత్మసంబంధమైనవియగు
జ్వరములు వ్రణంబు లాత్మసంబంధములగు
భయమునున్మాద మాత్మసంబంధములగు. 33

తా. శరీరసంబంధములు వ్యాధులు; మనస్సంబంధములాధులు; వ్యాధులు—జ్వరములు, వ్రణములు మొదలైనవి. ఆధులు—భయము, వెఱ్ఱి మొదలైనవి.

గీ. సాధ్యము నిదానమునకు నౌషధమునకు న
సాధ్యము నిదానమునకు నౌషధమునకును
లోఁబడినదియు మఱియును లోఁబడనిది
యనఁగవ్యాధులు ద్వివిధంబులగుచునుండు. 34

తా. నిదానమునకును, ఔషధమునకును లోఁబడినవ్యాధి సాధ్యమనియు, నిదానమునకును, ఔషధమునకును, లోఁబడనివ్యాధి అసాధ్యమనియును రెండువిధములు.

గీ. వానినన్నిఁటిదెలిసినవైద్యవరుఁడు
వానిఁబోఁగొట్టునౌషధవర్యములను
గలుగవలె మనుజులు సౌఖ్యగరిమఁగాంచ
నెద్దిలోపించినను గష్టమే యగు నిల. 35

తా. అన్నివిషయములఁదెలిసిన వైద్యవరుఁడును, సర్వరోగంబులను బోఁగొట్టఁదగినమందులును నరులారోగ్యవంతులగుటకుండవలెను. వీనిలో దేనికిలోపముకలిగినను భూమిపైఁగష్టమేయగును.

గీ. శాబ్దికులనామకరణముల్ సంతసమునఁ
దేల్చు విద్ధాతువునకును దెలివియనఁగ
నర్థమదిగలవాఁడు వైద్యవరుఁడయ్యె
భేషజముఁగలవాఁడెపో భిషజుఁడయ్యె. 36

తా. వ్యాకరణవేత్తల శబ్దకల్పనము సంతోషమును గలుగఁజేయును. "విత్" అనుధాతువునకు తెలివియని యర్థము. ఆతెలివిగలవాఁడే వైద్యుఁడు. అట్లే భేషజముగలవాఁడు భిషజుఁడయ్యెను.

గీ. రోగితత్వంబెఱుంగుచు రోగములను
లలినివారించు టదివైద్యలక్షణంబు
కలదు రోగంబునకుమందు, కలదె మందు?
వేయువిధములఁ దలఁచిన నాయువునకు. 37

తా. రోగితత్వముఁ దెలిసికొని రోగములను నివారించుట వైద్యునిపని. రోగమునకు మందు గలదుగాని, యెన్నివిధములనాలోచించిన నాయుర్దాయమునకు మందులేదు.

గీ. వైద్యకర్మానుభవమును వైద్యశాస్త్ర
వేతృతయుఁగలవాఁడెపో విపులవిపుల
వైద్యుఁడనఁదగు నీరెంటఁ బరగకున్న
నిప్రయోజకుఁడగుఁగాని నెగడఁగలఁడె. 38

తా. వైద్యకార్యములయం దనుభవమును, వైద్యశాస్త్రపరిజ్ఞానమును గలవాఁడే భూమియందు గొప్పవైద్యుఁడు. ఈరెండును లేకున్నయెడల నెందునకు గొఱగానివాఁడగుంగాని, ఖ్యాతిఁగలవాఁడు కాఁడుగదా.

గీ. అట్టిశాస్త్ర మాయుర్వేదమనఁగ వైద్య
శాస్త్రమన నథర్వణవేదశాస్త్రమందు
భాగమయియొప్పు నిప్పటి వైద్యశాస్త్ర
మునకుఁ దల్లక్షణోపలక్షణములుంట. 39

తా. అట్టిశాస్త్రము, ఆయుర్వేదమనియు, వైద్యశాస్త్రమనియు, అథర్వణవేదమం దొకభాగమై యొప్పుచున్నది. ఇట్టివైద్యశాస్త్రమున కాలక్షణములుండుటంబట్టియు, ఉపలక్షణములుండుటంబట్టియు—

క. ధీమంతులగుపండితసము
దాయము లోకోపకారతత్పరమతితో
నాయువు నారోగ్యమిడుట
నాయుర్వేదమని చెప్పి రవనిజనులకున్. 40

తా. బుద్ధిమంతులగు పండితులు, లోకోపకారబుద్ధిగలవారయి, ఆయురారోగ్యముల నొసంగుటంబట్టి ఆయుర్వేదమని జనులకుఁ దెలియఁజెప్పిరి.

చ. ఘనులును, యోగులున్, ఋషులు, గానన వసులు మంత్రశాస్త్రమం
దునిపుణులైలతాదికమునుం బరిశీలనఁజేసి యోగదృ
ష్టిని దెలియంగరానివి, విశేషమతిన్ గ్రహియించి సద్గుణం
బునొసఁగు నౌషధంబులను బూనిరచించిరి మేలుసేయఁగన్. 41

తా. గొప్పవారగు యోగులు, ఋషులు, మంత్రమహిమఁగలవారై లతలు, మూలికలు, మొదలయినవానియొక్క గుణములను బరిశీలించి తెలియనివిషయములను యోగదృష్టిచేఁ దెలిసికొని మంచిగుణమునిచ్చు మందులను జనంబులకు మేలుసేయుటకుఁ బట్టుదలతోఁ జేసిరి.

గీ. మూలికలచేత లతలచేఁ బుష్పములను
తేనెఁ బల్లవములచేత నీనెలను ద
ళంబులను ద్వక్కులను బాల నింపుమీఱఁ
జేయఁబడ నౌషధంబని చెప్పఁబడియె. 42

తా. వేళ్లచేతను, తీగెలచేతను, పూవులచేతను, తేనచేతను, చిగుళ్లచేతను, ఈనెలచేతను, ఆకులచేతను, పట్టలచేతను, పాలచేతను, చక్కగాఁజేయఁబడుటచేత నౌషధమని చెప్పఁబడియెను.

గీ. ఓషధులచేతఁ జేయుట నౌషధమగు
నోషధీరసభావన నొప్పుకతన
నౌషధంబగు రసగంధకాది వస్తు
సమితి నొనరించునదియేని క్ష్మాతలమున. 43

తా. ఓషధులచేఁ జేయఁబడుటచే నౌషధమయ్యెను. రసము, గంధకము, లోహములు మొదలగునవికూడ నోషధులరసముతో నూరుట, భావనచేయుటచేత నౌషధమేయయ్యెను.

చ. ఘనమగుశాస్త్రసంగతిని గానక మందులుసేయువాఁడు దా
మనుజులపాలిటన్ యముఁడు మానక ప్రాణములేగొనున్ యముం
డనయము దంభవైద్యుఁడు మహాపదలందునముంచఁజేయుచున్
ధనమును బ్రాణమున్ గొనెడు దండధరుండు ధనంబువీడెనన్. 44

తా. శాస్త్రము నెఱుంగకుండ వైద్యము సేయువాఁడు మనుష్యులపాలిటి యముఁడు. యముఁడు ప్రాణములు మాత్రమే తీయును. టక్కరివైద్యుఁ డెప్పుడును ఆపదల ముంచుముంచి ధనమును బ్రాణముంగూడఁ దీయును. యముఁడు ధనమును హరింపఁడు.

గీ. అట్టిమూఢాత్ము వైద్యునిఁ జట్టపట్టి
ధరఁజికిత్సలు సేయంపఁదగదు గాన

మంచియగదంకృతునచేత మఱి యసాధ్య
సాధ్యగదలను మాన్పింపఁజనును సతము. 45

తా. అట్టి తెలివితక్కువవైద్యునితో స్నేహముఁజేసి చికిత్సలు సేయింపరాదు గావున, మంచివైద్యునిచేత నసాధ్యరోగములకు సాధ్యరోగములకుఁ జికిత్స సేయించుట యెప్పుడును మంచిది.

క. కుదురునవి సాధ్యగదలును
కుదురనవి యసాధ్యగదలు కుదురనియవియా
గదలకు మందేలయనుచు
వదలుటకు నీలు లేదు వసుధాస్థలిలోన్. 46

తా. సాధ్యరోగములు కుదురునవి, అసాధ్యరోగములుకుదురనవియైయుండఁగాఁ గుదురనివ్యాధులకు మందెందుకని విడిచిపెట్టుట తగదు.

క. ధరఁ గంఠంబునఁ బ్రాణము
తిరముగ నున్నంతవఱకుఁ దిలకించుచు మే
దురమతిఁ జికిత్ససేయుట
నరధర్మమసాధ్యగద ఘనంబయియున్నన్. 47

తా. అసాధ్యరోగ మున్నతిగలదియైయున్నను గంఠమునఁ బ్రాణమున్నంతవఱకుఁ గనిపెట్టి మంచిబుద్ధితోఁ జికిత్స సేయుట మనుష్యధర్మము.

గీ. ఆసురియు మానుషియు దైవియనఁగఁ గత్తి
చేతమఱియుఁ గషాయమ్ముచేత దైవ
పూజచేఁ జేయఁబడునట్టి మూఁడువిధము
లగుచికిత్సలు ధాత్రిపై నెగడుచుండు. 48

తా. ఆసురి, మానుషి, దైవి, అనుపేర్లుగలగి, కత్తి, కషా

యము, దేవపూజ, అను మూఁడువిధములచికిత్సలు భూమియందు వృద్ధినొందుచుండును.

గీ. నాడి మలమూత్రముల జిహ్వ నయనములను
శబ్దమును స్పర్శమును రూపసౌష్ఠవమును
బట్టి రోగంబుగుర్తించి వైద్యమొనరఁ
జేయవలె నాడినే నమ్మఁజెల్లదెపుడు. 49

తా. నాడిని, మలమును, మూత్రమును, నాలుకను, నేత్రములను, ధ్వనిని, స్పర్శను, రూపమునుబట్టి రోగనిర్ధారణముచేసి వైద్యముచేయవలయునుగాని యొక్కనాడినేనమ్ముకొని యుండరాదు.

ఉ. నాడిపరీక్ష సేయుటననన్ బహుకష్టము తన్నిదాన మే
వాఁడును నేర్వనేరఁడు లవంబును దాన ఫలంబుగాన మా
నాడియెముఖ్యమైనఁ గరనాశనరోగులరోగ మేక్రియం
జూడఁగవచ్చునయ్యది వసుంధర భేషజవృత్తియై తగున్. 50

తా. నాడీపరీక్ష మిక్కిలి కష్టము. ఆనాడీనిదాన మందఱికిని దెలియదు. ఆనాడి, రోగచికిత్స కంత ముఖ్యమునుగాదు. నాడీపరీక్షయే రోగమును గనుఁగొనుటకు ముఖ్యమయినచోఁ జెబ్బవలకును రెండుచేతులులేనివాని గతియేమి? ఆనాడీనిదానమనునది భూమిపైఁ జాలమందివైద్యులయొద్ద దాంభికవృత్తితోనున్నది.

గీ. జ్వరమునకు నాడిగన నవసరముగాని
మూత్రకృఛ్రార్శములకు నెప్పుడును నాడిఁ
జూడఁబని లేదు పూర్వులీజాడఁ జనక
స్థానసప్తకబలమున జరపినారు. 51

తా. జ్వరమునకు నాడీపరీక్ష యవసరముగాని, మూత్రకృఛ్రమునకు, అర్శస్సునకు నెపుడును నాడి యవసరము లేదు. పూ

ర్వులగు చరకాదులీవిషయమును విపులముసేయక సప్తస్థానములను, అనఁగా మలమూత్రములు, జిహ్వ, నేత్రములు, శబ్దము, స్పర్శము, రూపము అనువీబలముల వైద్యమును బ్రవర్తింపఁజేసిరి.

గీ. అవయవంబులనెందేని నడ్డులేక
పెరుగు దుర్మాంసమునుగోసి ప్రియముసేయు
శస్త్రసాధనమంతయు జానుమీఱ
నాసురీవైద్య మనఁబడు నవనియందు. 52

తా. ఏయవయవమందైన నడ్డులేక పెరుగుచున్న దుర్మాంసమునుగోసి మేలుసేయు శస్త్రసాధనము, ఆసురీవైద్యమని చెప్పఁబడును.

గీ. పుష్పపత్రలతాశిఫామూలకంద
ములగునోషధులను లోహములు మొదలగు
భస్మములఁ జేయఁబడుచుండు వైద్యమరయ
మానుషీవైద్య మనఁబడు ధాత్రితలమున 53

తా. పూవులు, ఆకులు, తీగలు, ఊడలు, వ్రేళ్లు, దుంపలు, మొదలగు నోషధులచేతను, లోహాదిభస్మములచేతను జేయఁబడు వైద్యము మానుషీవైద్యమనఁబడును.

క. తలఁపగ దానంబులజప
ములచేత న్మఱియు హోమములచే రోగం
బులఁ బాఱఁజిమ్ముటయ్యది
యిల దైవీవైద్యమనఁగ నెన్నంగఁబడున్. 54

తా. దానములచేతను, జపములచేతను, హోమములచేతను, రోగములఁ బోఁదోలుట దైవీవైద్యమనఁబడును.

క. క్రమమగు శాస్త్రాభిప్రా
యమునించుక యేని నెఱుఁగనట్టియు మఱిశా
స్త్రమెచదివినట్టివైద్యా
ధములన్ దూరంబుసేయఁదగు నెయ్యెడలన్. 55

తా. బాగుగ శాస్త్రముయొక్క యభిప్రాయమును దెలియనట్టియు, శాస్త్రముమాత్రమే చదివినట్టియు నధములగు వైద్యును దొలఁగించుట యుత్తమము.

గీ. సత్ప్రవర్తన కలిగి శాస్త్రజ్ఞుఁడగుచు
వైద్యకర్మము నేర్చినవాఁడు ప్రాణి
కోటిక్షేమము నెప్పుడుఁ గోరువాఁడు
నయిన వైద్యుఁడు తగినవాఁడవనియందు. 56

తా. మంచినడతగలిగి శాస్త్రజ్ఞానముకలిగి, వైద్యప్రక్రియలనెఱిగినవాఁడును జీవులక్షేమముం గోరువాఁడునగు వైద్యుఁడుత్తముఁడు.

గీ ఎచటఁబుట్టినవానికి నచోటఁబుట్టి
నట్టియోషధులం జేయునైనయౌష
ధములెగుణమిచ్చునన్యౌషధములవలనఁ
గుదరదని యార్యులు వచింతుక్రమముమిగుల. 57

తా. ఏదేశమునఁబుట్టినవానికి, ఆదేశమునఁ బుట్టినయోషధులచేఁ జేయఁబడినమందే గుణమిచ్చును. ఇతరదేశమునందలి యోషధులచేఁ జేయఁబడిన మందులు గుణమీయఁజాలవు.

సీసమాలిక.

కల్కంబవినముద్దఁగాఁ జేయఁబడినది,
హిమమనమూలికలపరఁజితకఁ
గొట్టి నీటను నానఁబెట్టి వడియఁగట్టఁ
బడినట్టినీరగు, ఫాంటమనిన

Saraswata N... Acc. N 168 Vetapalem

మూలికలను జూర్ణముగఁ జేసి వేడినీ
ళ్లనునానఁబెట్టి తెల్లముగవడియఁ
గట్టఁబడిననీరు, ఘనభావనయనంగ
నొకవస్తువును మఱియొక్క రసము
ననునానఁబెట్టి యెండనుబెట్టఁబడినవ
స్తువు, లేహమన మడ్డిచొప్పఁగలది,
మోదకమనమడ్డి పూర్ణంబుగాగట్టి
పదువఱకును వండఁబడినదియును
తైలముఘృతమనఁ దైలంబునకుమారు
గానేతితో వండఁగాఁబడినది,
మాత్రలుఖజ్జలీమందులు రసగంధ
కములునుం గొన్నిలోహములు మూలి
కలుగల్పి నూరిచక్కఁగఁజేయఁబడినగు
టికలగు, మఱిపర్పటీలురసము
గంధకలోహముల్ కరగించిపోయంగఁ
బడినవి, మఱియును నుడుకుప్పె
లనినలోహదులు దనరంగరసగంధ
కములుసీసాలోన నమరనుంచి
వండంగఁబడినవి, పారుకుప్పెలు లేక
యెగురుకుప్పెలనంగ నెసఁగరసము
తోడగంధకముతోఁగూడ నితరలోహ
ములను సీసాలోనఁ బోసిపచన
మంజేయ సింధూరముంబోలెఁదగఁబెచ్చు
కట్టంగఁబడినవి, ఘనరసాయ

నమునదేహబలమునకై బుద్ధిబ
లమునకై లోహాదికముఁగాని

గీ. మూలికలచేతఁగాని యింపుగనురెంటి
చేతనంగాని చక్కఁగాఁజేయఁబడిన
యవియు, నాహ్యాప్తముగవాడననువుపడుచు
వినుతిఁగాంచి జగంబున వెలయుచుండె. 58

తా. కల్కమనఁగా మద్దగాఁ జేయఁబడినది. హిమమన మూలికలంజితుకఁగొట్టి నీటనానఁబెట్టి వడియఁగట్టఁబడిననీరు. ఫాంటమనఁగా వేళ్లుచూర్ణముచేసి వేడినీళ్లలో నానఁబెట్టి వడియఁగట్టఁబడిననీరు. భావనయనగా, ఒకవస్తువును మఱియొకరసములో నానఁబెట్టి యెండఁబెట్టఁబడినవస్తువు. లేహమనఁగా మడ్డిగానున్నది. మోదకమున మడ్డిగట్టిపదునంతవఱకు వండఁబడినది. తైలము, ఘృతమున నఁగాఁ దైలమునకు మాఱుగా నెయ్యిపోసివండఁబడినది. మాత్రలు, ఖజ్జలీమందులు, రసగంధకములు, లోహములు, మూలికలు గల్పి నూరి చేయఁబడినగుటికలు. పర్పటీలు రసము, గంధకము, లోహము కరగించి పోయఁబడినది. ఉడుకుప్పెలన లోహములు, రసగంధకములు, సీసాలోఁబోసి వండఁబడినవి. పారుకుప్పెలు లేక యెగురుకుప్పెలుననఁగా రసగంధకములతో నితరలోహములను జేర్చిసీసాలోవైచి వండఁగాఁ రససిందూరమువలెఁ బెచ్చుకట్టఁబడినవి. రసాయనములనఁగా శరీరబుద్ధిబలములకు లోహాదులచేతఁగాని, మూలికలచేతఁగాని, ఆరెండిటిచేతఁగాని చేయఁబడినవియు, అనువట్లు వాడుకొనుటకు వీలయి ప్రపంచమున వ్యాపకముం జెందియుండెను.

ప్రస్తుతస్థితి.

సీ. శాస్త్రమెఱుఁగక యౌషధముఁ జేసెడివారు
రోగనిదానంబు గాఢముగను

నరయకుండఁగ వైద్యము సేయువారును
వస్తుగుణంబు నేర్వకయె పథ్య
పానంబులను జెప్పఁబూనెడువారును
విరుగుడు లెఱుఁగక వెజ్జుతనము
సేసెడువారును చేఁతగాకున్నను
నేర్పరులట్ల వర్ణించుకొనెడు
గీ. వారు నెచ్చోట్లఁ జూడ విస్తారమైన
యట్టి మితిలేని రోగంబు లలముకొనుట
వైద్యశాస్త్రప్రవీణులై వాసిఁగన్న
వారికేనియు గౌరవప్రతిభ దగ్గె. 59

తా. శాస్త్రము తెలియక మందులు సేయువారును, రోగమును గుర్తింపకుండఁ జికిత్స సేయువారును, వస్తుగుణ మెఱుఁగకయే పథ్యపానాదులం జెప్పెడివారును, విరుగుడులు తెలియక వైద్యము సేయువారుని, చేఁతగాకున్నను జేఁతనైనట్లు గొప్పలు చెప్పుకొనువారును, ఎక్కడఁజూచినను విశేషముగానున్నట్లే లెక్కలేని రోగములును ప్రపంచమునందు వృద్ధిఁబొందియుండుటచే వైద్యశాస్త్రమునందు నేర్పరులగువారికైనను గౌరవము లేకపోయెను.

క. అగదంకారులమనుచును
మొగమోటమిలేక ద్రవ్యమును లాగుటయే
తగు వైద్యఫలమటంచును
జగతిని నపకారవృత్తిఁ జరియింతురొగిన్. 60

తా. వైద్యులమనిచెప్పుచు నెంతమాత్రమును బిడియము లేక ధనమునుగుంజుకొనుటయే వైద్యముయొక్క ఫలమని ప్రపంచమున నపకారవర్తనమున సంచరించెదరు.

సీ. జంగముమల్లయ్య లింగముకడ భస్మ
నివహంబు సేయఁగా నేర్చినాఁడ
సాతాని యాళ్వారుసన్నిధిలో లేహ
నిచయంబు సేయఁగా నేర్చినాఁడ
కుమ్మరిగుండయ్య సమ్ముఖమ్మున మాత్ర
నిర్మాణ మొనరింప నేర్చినాఁడ
మంగలిసోమన్న చెంగట నరముల
నెఱిపట్టుపట్టంగ నేర్చినాఁడ
గీ. చాకలి గురయ్యయొద్దను జలువసేయ
నుడుకునుడుకైన జలువసేయుటయు నేర్చి
నాఁడనని చెప్పుటయె కాని నాడెమైన
శాస్త్రపద్ధతి వైద్యంబు సలుపఁడొకఁడు. 61

తా. జంగముమల్లయ్యలింగముదగ్గఱ భస్మములు చేయుట నేర్చితిననియు, సాతాని ఆళ్వారుదగ్గఱ లేహములు చేయుట నేర్చితి ననియు, కుమ్మరగుండయ్యదగ్గఱ మాత్రాప్రమాణమును నేర్చితి ననియు, మంగలిసోమన్నదగ్గఱ నరములపట్లు నేర్చితిననియు, చాకలి గురయ్యదగ్గఱ జలుబుజేసిన నుష్ణమును, ఉష్ణము నున్న జలుబును జేయుట నేర్చితిననియుఁ జెప్పుటయేగాని యొకండును శాస్త్రానుసార వైద్యము సేయఁడు.

సీ. చేతిలో నెట్లుండెఁ జెప్పుమంచు వచింప
శ్లేష్మకారకమని చెప్పునొకఁడు
చేతిలో నెట్లుండెఁ జెప్పుమంచు వచింప
నజ్జిచెననియొక్క వెజ్జువలుకు
చేతిలో నెట్లుండెఁ జెప్పుమంచు వచింప
ద్వంద్వించెననుచును బలుకునొకఁడు

చేతిలో నెట్లుండెఁ జెప్పుమంచు వచింప
. నంతర్గతజ్వరం బనునొకండు

గీ. చేతిలోపల నెట్లుండెఁ జెప్పుమనినఁ
బయిన నెట్లుండెనల్లె లోపలను గలద
టంచు వచియించునొక్కఁడు హస్తమందు
నేమియును లేదనుచు వచియించునొకఁడు. 62

తా. చేతిలో నెట్లుండెనో చెప్పుమన నొకఁడు శ్లేష్మకారక మనియు, నొకఁడు నజ్జుచేసినదనియు, నొకఁడు ద్వంద్వించెననియు నొకఁ డంతర్గతజ్వరమనియు, నొకఁడు పైకెట్లున్నదో చేతిలోన నట్లేయున్నదనియు, ఒకఁడు చేతియం దేదోషమును గాన్పించదని యును బలుకును.

గీ. అరయ నిందటిలో నిద్దరైనఁగాని
యొక్కగతి నాడినింబట్టి చక్కఁజెప్పఁ
జాలరట్లగుటంబట్టి శాస్త్రఫక్కి
నాడిగుర్తింపలేరని యాడవచ్చు. 63

తా. ఇట్లుపల్కు నిందటిలో నిద్దరయిన నొక్కవిధముగా నాడినిబట్టి చెప్పకపోవుటచేత నే శాస్త్రమునఁ జెప్పినట్లు నాడింబరీక్షిం పఁజాలరని చెప్పవచ్చును.

గీ. రజితలోహరసాయన రాజదౌష
ధంబునందున్న యారజితంబుఁదీయఁ
గల్గుదువె నీవు? నేదీయఁగలనటంచు
గొప్పలం జెప్పుకొందురు కొంతమంది. 64

తా. రజితలోహరసాయనమను నౌషధరాజమందున్న వెం డిని నీవు తీయలేవు. నేను తీసెదనని కొంతమంది పందెములు వైచి కొందురు.

గీ. గంధకముశుద్ధి నీచేఁతగాదు సేయ
నేనొనర్చెదఁగనుమని నేర్పులేని
వాదములతోడఁ గాలయాపనము సేయు
నొక్కవైద్యుఁ డొకింతయును బుసుపోక. 65

తా. గంధకమును శుద్ధిజేయుట నీచేఁతగాదు. నేను చేసెదఁ జూడుమని తెలివితక్కువవాదములతో నొక్కొకవైద్యుఁ డుబుసు పోక కాలక్షేపము సేయుచుండును.

సీసమాలిక.

అల్లంబు బెల్లంబు నల్లనఁ దినిపించి
కుదురుఁబోనీకని పదరువాఁడు
రోగిచచ్చినవెన్క రాఁగలమూల్యంబుఁ
దెమ్మని కడుపీకి తినెడువాఁడు
ఔషధంబులకన్న ననుపానమున కెన్ని
యో చెప్పి ద్రవ్యంబు నొడుచువాఁడు
గడియలోఁ జానున్న బడుగురోగిష్టుల
బ్రతికింతునని ప్రతిజ్ఞఁ బలుకువాఁడు
కుదిరినఁ గుదురకున్నఁ దొలుత జరిగిన
యది తప్పరాదని యాడువాఁడు
ననుబిల్చి ముందుమన్నన సేయకుంటిరా
తన వైద్యమే చూడుఁడనెడువాఁడు
రోగంబుమరలని రోగికిఁ బథ్యంబు
నిడినాఁడనని వచియించువాఁడు
నూనె గుమ్మడి యావనుం దినిపింతునే
నీరోగిచేసని చేరువాఁడు

చేయిఁజూడక మాత్రవేయక స్పర్శచేఁ
బలికింతునని చాలపదరువాఁడు
కలఁగెఁగన్నులు మందుగావలెననిపల్కఁ
గనులకలఁక మంచిదనెడువాఁడు
కాయంబునెత్తురు గడ్డలనిండెన
న్ననురక్తవృద్ధియంచనెడివాఁడు
దంతపీడకు నౌషధంబిమ్మనిన నూడఁ
దీయించుకొనుమంచుఁ దెలుపువాఁడు
కానిశాస్త్రప్రకారంబు వైద్యంబు
సలిపి సౌఖ్యమొసంగు జనుఁడు లేఁడు

గీ. కూనిరాగంబుఁదీయని మానవుండుఁ
గుడుములను వండఁజాలని కోమలాంగి
లేదు లేదనుసామెతఁజూడ వైద్య
మెఱుఁగనట్టిఁడు లేఁడు మహీతలమున. 66

తా. అల్లము బెల్లముదినిపించి కుదురును పొమ్మనెడివాఁడును తాను వైద్యముచేసినరోగి మరణించినవెన్కఁగూడ రాఁగలదని ధనమునకై వేధించువాఁడును, ఔషధముకొన్న ననుపానములకుఁగాఁ జాలధనము లాగువాఁడును, మరణించుటకుసిద్ధముగానున్నవానిని బ్రతికింతునని డంబములు పలుకువాఁడును, కుదిరినను కుదురకపోయినను, అనుకొనినప్రకారము ధనమును గుంజుటకై ప్రయత్నముచేయువాఁడును, ముందుగా నన్నుఁ బిలిచినారుకారు కావున, మొదట వానిచేతనే వైద్యముచేయించుకొనుఁడనువాఁడును, రోగము మరలకున్నను పథ్యంబుఁ బెట్టింతుననువాఁడును, ఈరోగిచే నూనె, గుమ్మడి ఆవ, తినిపింతుననువాఁడును, చేతినాడెముచూడక మందువేయక ముట్టుకొని మాట్లాడింతుననువాఁడును, కనులకలఁకకు మందిమ్మ

నిన గనులు కలఁకనొందుటరయే మంచిదనువాఁడును, నెత్తురుగడ్డలచే బాధపడుచున్నాననిన రక్తమువృద్ధియగుచున్నదనువాఁడును, దంతములు నొప్పిగానున్నవనిన నూడఁదీయించుకొనుమనువాఁడును, ఉండిరేకాని శాస్త్రముననుసరించి వైద్యముఁజేసి సౌఖ్యముఁనొసఁగువాఁడొక్కఁడును లేఁడు. కూనిరాగముఁదీయనివాఁడును, కుడుములువండలేని యాఁడుదియుఁ గానరానునట్లు భూమియందు వైద్యమెఱుంగనివాఁడొక్కఁడును లేఁడు.

ఉ. మ్రందఁగఁజేయుశ్లేష్మముదరంబుననిండి గళంబుడాసె మీ
మందునొసంగి దింపుఁడన మందునుదెచ్చిగళంపుశ్లేష్మమున్
గ్రిందికిఁబోవదీ నుపచరించదు శ్లేష్మముతగ్గగానె నా
కుం దెలుపుండు మందిడెద గొబ్బునఁదగ్గునటంచొకండనున్. 67

తా. ప్రాణములుదీయుశ్లేష్మము గుండెలంజుట్టుకొని కుత్తుక నిండెంగావున మీమందువైచి శ్లేష్మముందింపుఁడన మందునుదీసికొని రోగియొద్దకువచ్చి గొంతుకలోనిశ్లేష్మము క్రిందికిదిగకుండ నౌషధమువైచినఁ బ్రయోజనములేదు గావునఁ, గంఠములోనిశ్లేష్మముతగ్గఁగానే నాకుఁదెలియపరచిన మందిచ్చెదననియు దానిచే వేగముగా శ్లేష్మము దిగిపోవుననియు నొక్కఁడుపలుకును.

చ. ఘనమగు వీర్యనష్టమునఁ గాళ్ళును జేతులుఁ బీకునంచు నా
తనయుఁడు మందుఁదెమ్మనియె దైవమవీవు భిషగ్వరుండ మం
దునొసఁగుమంచు వేఁడుకొనఁ దోడనె నీసుతువారకాంత పొం
దునఁజరియింపఁజేయఁగఁ జనుఁ జనుమంచును నొక్కరుండనున్. 68

తా. గొప్పవీర్యనష్టముచే నాకుమారుఁడు కాళ్లును, చేతులు లాగుచుండుటచే మందుఁనిప్పించుమని చెప్పుచుండెను. దైవసమానుఁడవగు నో వైద్యుఁడా! మందిమ్మనికోరగా వెంటనే నీకుమారుని వారకాంతలతోఁ గూర్చుట మంచిదిపొమ్మని యొకఁడనును.

సీసమాలిక.

కన్యకోమలియనఁగా నేమి వైద్యుఁడా
యనఁ జిన్నదానికి నర్థములను
నీశ్వరియన్నచో నేమి వైద్యుఁడయన్న
హరుని యిల్లాలిపేరని వచించుఁ
బాటయన్న నదేమి వైద్యుఁడా యన్నను
గానమర్థంబని కడఁకఁ బలుకు
గారనా వైద్యుఁడా కనఁగ నేమని వచిం
చిన మణిదోష విశేషమనుచు
భూశర్కరయనంగ భువి నేమి వైద్యుఁడా
యన నేలబెల్లమంచును వచించు
మంగయనిన నేమి మఱి వైద్యుఁడా యన
వేంకటేశ్వరునకుఁ బెండ్లమనును
దంతధావనమనఁ దరనేమి వైద్యుఁడా
యనఁ బలుదోముటయనుచుఁ బల్కు
ధాత్రియనంగ నర్థంబేమి వైద్యుఁడా
యన భూమికింబేరటంచుఁ బలుకు
జననియనంగ నిచ్చట నేమి వైద్యుఁడా
యనఁ గన్నతల్లికి నర్థమనును
త్రిఫలంబులన నేమి తెల్పుము వైద్యుఁడా
యన మూఁడుపండ్లని యాడుచుండు
రోహిణియన నేమి యూహింతు వైద్యుఁడా
యన నదియొక తార యని వచించు

గీ॥ బ్రిస్తృతార్థముసేయక ప్రస్తుతార్థ
వాదులయి వైద్యులమటంచు వదరుచుంద్రు

శాబ్దికుని “కంటకారికషాయ” గాథ
ననుకరించుచు రోగుల కడరుమ్మించు. 69

తా. ఓ వైద్యుఁడా! కన్యకోమలియనఁగా నేమియన నొక చిన్నదానికర్థమనియు, ఈశ్వరియనఁ బార్వతియనియు, పాటయన సంగీతమనియు, గారయన మణిదోషవిశేషము, అనగా పట్టుట యనియు, భూశర్కరయన నేలబెల్లమనియు, మంగయన నలమేలు మంగాదేవియనియు, దంతధావనమనఁ బండ్లుతోముటయనియు (చంద్ర) ధాత్రియన భూమియనియు (ఉసిరిక) జననియనఁ దల్లియనియు, (కోరింద) త్రిఫలంబులన మూఁడుపండ్లనియు, (కరక తాడియు సిరికలు) రోహిణియన నక్షత్రమనియు, (కటుకరోహిణి) సందర్భానుసారమగు నర్థముం జేసికొనక మఱియొక యసందర్భార్థముం జెప్పి శబ్దశాస్త్రవేత్తయగు పండితుఁడు, కంటకారికషాయమనిన, కంటకమనిన ముల్లుగదా, దానికి, అరి=శత్రువు చెప్పులజోడుగదాయని యర్థముచేసికొని పాతచెప్పులజోడుకషాయముపెట్టుకొని త్రాగిన కథననుసరించుచు రోగగ్రస్థులకు విచారము వృద్ధియగునట్లు వైద్యులమని చెప్పుకొనుచుఁ బ్రేలుచుందురు.

సద్వైద్యలక్షణము.

ఉ॥ దానము ధర్మమున్ జపవిధానము శాంతియు దాంతియుత్తమ
జ్ఞానము సూక్ష్మబుద్ధియును శాస్త్రవివేచన శౌచవృత్తి పూ
ర్ణానుభవంబు భక్తియును వ్యాధినిదానముఁ బాకశుద్ధియున్
మానముఁ గల్గు వెజ్జువిల మాన్యులు ధన్యులు గణ్యులెన్నఁగన్ 70

తా. దానము, ధర్మము, జపపద్ధతి, శాంతి, దాంతి, (అంతరింద్రియనిగ్రహము) శ్రేష్ఠమయిన జ్ఞానము, సూక్ష్మబుద్ధి, శాస్త్రజ్ఞానము, శుచి, మంచియనుభవము, భక్తి, రోగనిదానము, ఔష

ధములనశుభ్రముగా వండునేర్పు, అభిమానము, ఇవిగలిగిన వైద్యులు భూమియందాలోచింపఁగాఁబూజింపఁదగినవారు, ధన్యులు, పేరొందఁదగినవారును.

మ. తగుమందుల్రుచియించి నేర్పుమెయి వైద్యంబొప్పఁగాఁజేసి తా
నగందకారసమాఖ్య సార్థకముగానందంగనుత్సాహమున్
మిగులంజెందుచుఁ జేతివచ్చునకుంజింతింపఁగాఁబోని వాఁ
డోగి వైద్యవరుండునా జగతినోహో ఖ్యాతిఁబొందెడున్.

తా. మంచిమందులనుజేసి నేర్పుతో వైద్యముఁజేసి తాను అగదంకారుఁడు (అనగా రోగములేకుండఁజేయువాఁడు) అనుపేరును సార్థకమైయొప్పునట్లు పొందుసంతోషమును మిక్కిలిపొందుచు ధనవ్యయమునకుంగూడ విచారింపకుండువాఁడే వైద్యశ్రేష్ఠుఁడని ప్రపంచమునఖ్యాతినొందును.

మ. ఒకనిందిట్టక నిందసేయకభయం బొక్కింతయున్ లేకయు
త్సుకవృత్తిం జరియించుచున్ గరువముం జూపోపమిన్ మాని క
క్షకు లోఁగాక సమస్తమానవులకున్ సద్బంధుతుల్యండునాఁ
బ్రకటింపఁబడువాఁడె వైద్యవరుఁడన్ బ్రఖ్యాతికింబాత్రుఁడౌ.

తా. ఎవ్వనిందిట్టక, నిందింపక, భయమెంతమాత్రమునులేక నిత్యసంతోషముతో సంచరించుచు గర్వము, ఓర్వలేమి, మాని వైరములేక యెల్లప్రజకును యోగ్యుఁడగు చుట్టముతో సమానుఁడని చెప్పఁబడువాఁడే వైద్యశ్రేష్ఠుఁడను ప్రఖ్యాతికిం దగినవాఁడు.

ఉ. రోగము మిక్కుటంబగుచు రూఢిగఁజావఁగనున్నయట్టి యా
రోగినిజూచి యోష్ఠము నెఱుంగఁగవంచుచు మించఁబెట్టి రే
లాగు చికిత్స సేయుదునహా! యనిపల్కక యిద్దియెంత నే
బాగొనరింతుఁజూడుఁడని పల్కునతండె భిషగ్వరుండగున్. 73

తా. రోగము మితిమీఱి నిశ్చయముగాఁ జచ్చుటకు సిద్ధముగానున్నరోగినిజూచి పెదవివిరచి అయ్యయ్యో! రోగముమించఁబెట్టినారు. నేనెట్లు చికిత్ససేయుదును. ఆహా! యని విచారముతోఁబల్కక, ఈరోగమనఁగానెంత నేనుబాగుసేయుదును చూడుఁడనునట్టివాఁడే వైద్యశ్రేష్ఠుఁడగును.

క. ఒనరఁగఁ దాఁజేపట్టిన
ఘనరోగంబులఁజికిత్సఁ గావించి సుఖం
బునుగూర్చిపిదపధనముం
గొనునాతఁడు శ్రేష్ఠవైద్య కోవిదుఁడరయన్. 74

తా. తాను చేపట్టినరోగుల రోగములను జికిత్సచేసి కుదిర్చి తరువాత ధనమును దీసికొనునాతఁడు వైద్యోత్తముఁ డనంబడును.

గీ. ఆఢ్యతయు నిస్వతయు మర్త్యులందె కాని
రోగములయందటుండమి బాగుమీఱ
రోగులకు మందొసంగెడుచో గుణమిడు
మందుల నొసంగువాఁడెపో మంచివెజ్జు. 75

తా. ధనికత్వమును, దరిద్రతయు, మనుష్యులయందేయుండునుగాని రోగములలో నట్టిభేదముండకపోవుట (అనఁగా ధనికునకు వచ్చుజ్వరమును, బీదవానికివచ్చుజ్వరమును ఒక్కవిధముగలదియే యని] చేత రోగులకు మందిచ్చువిషయములోఁ జక్కఁగాఁ బనిసేయుమందులను భేదముగాఁజూడక యిచ్చువాఁడే మంచివైద్యుఁడు.

క. ఒకమందును నొకమందుగఁ
బ్రకటించి చికిత్స సేయ వ్యాధిక్రమమునన్
వికటించుఁగాన వైద్యుఁడు
వికలాంబకుఁడగుట తగదు విశ్వమునందున్. 76

తా. ఒకమందు కింకొకమందుగాఁ దలంచి చికిత్సచేసినయెడల క్రమముగా వ్యాధి వికటముం జెందుఁగావునఁ బ్రపంచమునం దెవ్వఁడును వైద్యుఁడు గుడ్డివాఁడుగా నుండుట మంచిదికాదు.

గీ. నరములను నేత్రముల జిహ్వ నాసికనొగిఁ
దగఁబరీక్షించుటకు మూలమగునుగాన
ఘనచికిత్సకుఁడుగనుండు మనుజునకును
వేళ్ళులేకుంట తగదు పృథ్వీతలమున. 77

తా- భూమియందు గొప్పవైద్యుఁడుగానుండు మనుజుండు రోగియొక్క నేత్రములను, నాలుకను, ముక్కును జక్కఁగాఁబరీక్షింపవలయునుగాన నట్టివైద్యుఁడు చేతివ్రేళ్ళులేనివాఁడుగా నుండుట తగదు.

గీ. మాత్రలఁ బ్రమాణముగసేయ మందుఁబూయ
నౌషధపుపాత్రలను శుచినందఁజేయఁ
గల్మషపుగండలను గోయఁగరమునందు
వ్రేళ్ళువెజ్జకుండమి విపులఁదగదు. 77

తా. మాత్రాప్రమాణముసేయుటకును మందునుబూయుటకును జౌషధపాత్రలను శుభ్రముసేయుటకును, కొయ్యగండలం గోయుటకును, వ్రేళ్ళు ముఖ్యముగావున నవిలేనివైద్యుం డర్హుండుకాఁడు.

గీ. కడుపునొప్పియటన్నను గాలునొప్పి
గావినంబడి దానికే సేవసేయ
మందొసంగును గావున మహిని బధిరుఁ
డైనయతఁడగదంకృతుఁ డగుటతప్పు. 79

తా. కడుపు నొప్పిగానున్నదనినఁ గాలునొప్పిగానున్నదనిన

యట్లు వినఁబడి కాలునొప్పికి మందిచ్చునుగాఁబట్టి భూమిపైఁ జెవిటివాఁడు వైద్యుఁడుగా నుండఁగూడదు.

గీ. వేగమాటాడి మందును వేయవలయు
ననెడునెడ వెక్కివెక్కి మాటాడుకతనఁ
బ్రాణనష్టము సమకూడుఁ గానధాత్రి
నత్తివాఁడు వైద్యుఁడుగ నెన్నఁడుఁ దగఁడు. 80

తా. త్వరగామాటలాడి రోగికి మందువేయఁదలఁచినపుడు వైద్యుఁడు జామున కొకమాటచొప్పున నట్టుగామాటలాడుటచేఁ బ్రాణహానిసంభవించునుగనుక నత్తివాఁడు వైద్యుఁడుగా నుండరాదు.

గీ. కూరుచుండినచోటను గూరుచుంట
ముట్టినపదార్థములనెల్ల ముట్టుకొంట
నంటుకొనుఁగాన గుష్ఠరోగాదులున్న
నట్టివారు వైద్యమున కనర్హులరయ. 81

తా. కుష్ఠరోగము మొదలైన యంటురోగంబులుగలవారు కూర్చుండినచోటఁ గూర్చుండుటచేతను, ముట్టుకొనిన పదార్థములను ముట్టుకొనుటచేతను, నా రోగము లంటును గావున నట్టి కుష్ఠరోగాదులున్నవారు వైద్యముసేయుటకుఁ బనికిరారు.

చ. నయనములెఱ్ఱవారెనని నాలుకపూసెనటంచు నన్నమిం
తయును సహింపదంచును బదంబులుపీకునటంచు దేహమం
తయు నుడుకెత్తుచున్నదని దగ్గని యిట్టులనెన్నియెన్నియా
మయములుపేరుకొన్న నుతిమంగొనునాతఁడె వైద్యవర్యుఁడౌ. 82

తా. కన్నులెఱ్ఱబడెననియు, నాలుకపూసినదనియు, అన్నము సహించుటలేదనియు, కాళ్లుపీకుననియు, శరీరమంతయు నుడుకెత్తుచున్నదనియు, దగ్గున్నదనియు, నిట్లెన్నెన్ని రోగములున్నవని

చెప్పినను విసువులేక యోర్పుగలిగి వైద్యము చేయునాతఁడే వైద్యులలోనుత్తముండు.

ఉ. ఎంతటియేహ్యవస్తువులనేని కనంగ నసహ్యభావము
క్కింతయు లేక యోగ్యము లహీనములట్ల దలంచుచుండి వే
దాంతులఁబోలె సర్వసములై చరియించుభిషక్శిఖామణుల్
మంతున కెక్కి లోకమున మాన్యతఁగాంతురు సర్వభంగులన్. 83

తా. ఎట్టియసహ్యపదార్థములనేని చూచి అసహ్యపడక తగినవియు, ఘనమయినవియుఁగా నెంచి వేదాంతులవలె నన్నిట సమానభావముగలవారై సంచరించిన వైద్యశ్రేష్ఠులు లోకమందు గౌరవింపఁబడి, అన్నివిధములను బూజింపఁబడుదురు.

చంపకమాలిక.

ఘనమగురోగపీడితుని గాంచి నిశం దగ నిద్రవట్టునా ?
తినెడుపదార్థముల్ లఘుగతిం గడుజీర్ణములై చెలంగునా ?
దినదినము న్విరేచనము తీరుగనయ్యెడునా ? సమస్తభో
జనవరవస్తువుల్ హితవుసల్పునె జిహ్వకుఁ ? గాళ్లుఁ జేతులుం
దనువు శిరస్సు భారముగఁ దార్కొనకుండునె ? నేత్రయుగ్మమం
దునఁ బాగ రేగకుండునె ? గతుల్ దడబాటును జెందకుండునే ?
యనవరతంబు జిహ్వ పొడియై కనుపట్టకయుండునే ? గళం
బున గురుకల్ బయల్వడక భూరితరంబగుమాట లేకయుం
డునె ? చెవిదోయి హోరులెపుడుం గనుపింపకయుండునే ? జ్వరం
బును నిరతంబు రాదుగద ? పొర్లుగవచ్చుటమానెఁగాదె ? వే
దనమఱియేమి లేదుగద ? దాహముఁ గట్టెఁగదా ? శరీరమం
దున జిల యెంతమాత్రమును దోఁపకయుండెఁగదా ? కనంగ నీ
కనులనునీరుగారుటలు గట్టెఁగదా ? కనురెప్పలందు గో

ళ్లను దగురక్తముండెనె ? బలంబదిజానువులందుఁగల్గునే ?
యనుచును బ్రశ్నసేయక మహామతి వానిముఖంబుఁబట్టి నా
డిఁబరికించి యాతని కడిందిగునంబులఁ జెప్పునట్టి వై
ద్యునిఘనుఁడంచు లోకముమహోన్నతుఁగాఁగొనియాడునిచ్చలున్.

తా. రోగిని పరీక్షింపఁ బోయినపుడు, కడుపునొప్పి లేదుగదా ? అన్నమరుగుచున్నదా ? అను మొదలైన తనకుఁ దెలిసికొనవలసిన ప్రశ్నలన్నియు రోగినడిగి తెలిసికొనకుండఁగనే యాతని ముఖలక్షణములం బట్టియు, నాడీచలనమును బట్టియు, వానిగుణంబులన్నియుఁ దానే పరిశీలించి చక్కఁగా వైద్యము సేయునతఁడు ఘనవైద్యుఁడను ప్రఖ్యాతిం గాంచును.

గీ. బుద్ధిబలమున నొకమందు సిద్ధపరచి
మున్ను దాఁ దిని తద్గుణమ్మును గ్రహించి
పరులకిడునట్టి యాతండు పరమవైద్య
శేఖరుండను ప్రఖ్యాతిఁ జెంది వెలయు. 85

తా. తనస్వశక్తిచే నేదేని, ఒకమందును దయారుచేసినపుడు ముందు తా నామందును సేవించి, ఆయౌషధంబునఁగల మంచిచెడ్డలను దెలిసికొని పిదప నితరులకు వాడినయతఁడే గొప్పవైద్యుఁడని ఖ్యాతినందును.

సదుపదేశము.

సీ. ద్రవ్యశుద్ధియు మఱి ద్రవ్యగుణమ్ము ని
ఘంటువు లనునట్టి కనులుమూఁడు
వాతపైత్యములు కఫద్వంద్వము లనను
నాడులఁ దెలియుట న్నాల్గుకలలు,
షడ్రసంబులన హస్తములాఱు, నష్టస్థ
లపరీక్షలనువట్టివపువులెన్ని

ది, దశనాడులును పఱి దశవాయువులును
ననుసట్టి పదికాళ్లు నమరఁగలిగి
గీ. రోగిరోగకారణమును బాగుమీఱఁ
దెలిసికొనిసచ్చికిత్సలు సలిపి జనుల
కెలమినారోగ్యమిడుచు మహీతలమున
సంచరింపఁగఁదగు భిషక్సమితికెపుడు. 86

తా. ద్రవ్యశుద్ధి, ద్రవ్యగుణము, నిఘంటువులు ననుమూఁడు నేత్రములును, వాతపిత్తశ్లేష్మద్వంద్వనాడీపరిజ్ఞాన మను నాలుగు శిరస్సులును, షడ్రసంబులను నాఱుచేతులును, అష్టస్థానపరీక్షయను నెనిమిదిశరీరములును, దశనాడులు దశవాయువులు ననుపదిపాదములును, గలిగినవాఁడై వ్యాధిగ్రస్తురోగమును గురుతుపట్టి చక్కని చికిత్సలుచేసి జనంబులకారోగ్యమును గూర్చుచు వైద్యశిఖామణులు భూమిపై సంచరింపవలయును.

సీ. కోపంబుఁజంపి యొక్కడుశ్రద్ధవహించి
శాంతంబుఁదాల్చి యాశలను గెలిచి
దుర్వృత్తు లడఁగించి సద్వజనానంద
కరవర్తనంబునఁ గాలుపెట్టి
యోపికఁ గొని నిష్ఠురోక్తులవిడనాడి
యల్పసంతోషంబు నంది భీతి
దూరంబుగాఁదోలి శూరత్వమునుబూని
నిర్మలబుద్ధితో నెగడి సర్వ
గీ. శాస్త్రపరిచయుఁడై వైద్యశాస్త్రవేత్త
యగుచునెల్లరియెడ దయ నాత్మఁజూచు
నాతఁడే వైద్యుఁడనఁగ మహీతలమునఁ
బేరుఁబొంది యశస్వియై వెలయుచుండు. 87

తా. కోపంబువిడిచి శ్రద్ధగలిగి శాంతమూర్తియై దురాశలనువిడిచి సన్మార్గవర్తియై, అందఱికిం దలలోని నాల్కవలె సంచరించుచు ఓపికగలవాఁడై పరుషవచనంబులు పలుకక, మధురభాషణుండై అపరిమితసంతోషియై భయములేక ధైర్యముతో స్వచ్ఛమయినబుద్ధితో మెలంగుచు సమస్తశాస్త్రములును దెలిసినవాఁడై అందఱియందును దయగలవాఁడై యుండినయతఁడే వైద్యోత్తముం డను పేరునుబొంది కీర్తిమంతుఁడై ప్రకాశించును.

క. స్థిరముధనాశాలగ్న
స్థిరహృదయులుగాక సన్మతిన్ రుగ్జనా
దరముం గాంచుచు సద్గతి
కరుగం దలపోయవలయు ననువుగ వైద్యుల్.

తా. భూమియందుఁ దమవైద్యము ధనాశనేకాక రోగగ్రస్థులగు జనులయందు దయగలవారై రోగమును నిర్మూలించుటయందుంగూడ వినియోగపడునట్లొనరించి వైద్యు లుత్తమగతులకుం బోదురుగాక !

క. మలమూత్రవిసర్జనముల
వలనెఱిఁగి శరీరవర్ణ పద్ధతులెల్లం
దెలిసికొని తగుచికిత్సల
సలుపవలెఁ సతము వైద్యశాస్త్రజ్ఞులిఁకన్. 89

తా. వైద్యశాస్త్రమందుఁ బ్రవీణులగువారెప్పుడును రోగియొక్కమలమును, మూత్రమును బరిశోధించి శరీరకాంతిని బరీక్షించి తెలిసికొని వానికిం దగినచికిత్సలు సేయవలెను.

గీ. నిర్వికారమనస్కుఁడై నిశ్చలాత్ముఁ
డగుచు నామయబాధితులైనవారి

నరయువలె నన్యచింతాపరాయణతను
దగఁ బరికింప వైద్యవిద్యానిధియును. 90

తా. ఏవిచారమును మనస్సుననిడుకొనక నిశ్చలమైన మనస్సుగలిగి రోగగ్రస్తులయినవారిఁ బరిశీలింపవలయును. ఎంత వైద్యమందు గట్టివాఁడైనను, అన్యచింతతో రోగమును బరిశీలింపరాదు.

క. శుద్ధులువలసిన యెడఁ బరి
శుద్ధముగ నొనర్చి యెపుడు జొన్పఁగవలయున్
శుద్ధమగువస్తువులఁ బరి
శుద్ధమనంబునను వైద్యసూరి చికిత్సన్. 91

తా. చికిత్స సేయునప్పుడు వైద్యపండితుఁడు కావలసినపుడు మంచివస్తువులను సంపాదించి మంచిమనస్సుతో బాగుగ శుద్ధిచేసి వాడవలయును.

గీ. జనక సారంగధరకుంభసంభవర్షి
మీననాథాశ్విని వ్యాసమౌనిముఖ్యు
లైనవారిమతం బాగి ననుసరించి
వైద్యమొనరింపఁదగు వైద్యవరుల కెపుడు. 92

తా. జనకుఁడు, సారంగధరుఁడు, అగస్త్యుఁడు, మీననాథుఁడు, అశ్వినీదేవతలు, వ్యాసుఁడు మొదలైనవారి మతములననుసరించి వైద్యశిఖామణులు వైద్యము చేయఁదగును.

ఉ. మందునొనర్చునప్పుడును మందును రోగుల కిచ్చునప్పుడున్
మందు గుణాగుణంబుల విమర్శనఁ జేసెడునప్పు డెక్కుడా
నందముతో నుపాయము లనారతమారసిచేసి యిచ్చి యిం
పొందఁగ నేర్చియుండుట మహోత్తమపద్ధతి భూతలంబునన్. 93

తా. మందును చేయునపుడును, రోగులగువారికి మందు నిచ్చునప్పుడును, మందుయొక్క గుణాగుణముల విమర్శించునపుడును

మిక్కిలిసంతోషముతో సర్వకాలమును దెలిసికొని మందులుచేసి, మందులిచ్చి, మందుయొక్క మంచిచెడ్డల నాలోచించి తెలిసికొని యుండుట యెంతయును మంచిపద్ధతి.

చ. ఒకనినిమించి యొక్కఁడు మహోత్తమకోవిదుఁడుంట సత్యమం
చకలుషవృత్తిఁ బూని యనయంబుఁ జరించుట మేలు, నేనె యెం
తకుఁదగినట్టివాఁడనని తక్కినవారల నిందసేయఁ బూ
నకుఁడు మనీష యొక్కనిధనంబగునా తగునా విరోధముల్. 94

తా. ఒకనినిమించి యొక్కఁడు మహాపండితుఁడుండుట నిజమని స్వచ్ఛమైనవర్తనముగలిగి నిత్యమును సంచరించుట మంచిది. నేనే గొప్పవాఁడనని యన్యులను నిందసేయరాదు. బుద్ధి యొక్కని సొమ్ముకాదు, విరోధములు పెట్టుకొనుట తగదు.

క. విద్యాధికులైయుండిన
వైద్యంబును సేయుటొండె, వైద్యకృతుల స
ద్విద్యాకౌశలమేర్పడ
సద్యఃఫలదముగఁ జేయఁ జనుటొండె తగున్. 95

తా. విద్యాధికులైనయెడల వైద్యముచేయుటగాని, వెంటనే ఫలమునిచ్చు వైద్యగ్రంథములను సేయుటగాని తగును.

ఉపసంహారము.

మ. కరుణాసాగర! సాగరాత్మజ! జగత్కల్యాణచారిత్ర! దు
ష్కరదివ్యౌషధరాజరాజికరణేచ్ఛామాత్రసంతోషబం
ధురహృత్పంకజ! పంకజప్రభవవిష్ణువ్యోమకేశాదిని
ర్జరసంపూజితపాదనీరజ రజస్సంపూర్ణదిఙ్మండలా! 96

క. అమృతధికుమార! యమృత
ధ్యమృతసహోదరీ! వరామృతాంధో వైద్య

Saraswata Niketanam. Acc. No.

స్యమృతకర! యమృతవాగ్వర!
యమృతాశన! యమృతలోక! యమృతాలోకా! 97

పంచచామరము.

నిరామయప్రదా! యశేషనిర్జరప్రపూజిత
స్ఫురన్మనోజ్ఞపాదపద్మ! శుభ్రకీర్తిరాజిత
స్వరోచిజాలభాసమానశాంతరూప! నిర్మలాం
తరంగమంగళాంగ! దివ్యధామవాసభాసురా! 98

గద్యము.

ఇది శ్రీకౌండిన్యసగోత్ర పవిత్ర రామనార్యపుత్ర
క్రొత్తపల్లి సుందరరామనామధేయప్రణీతం
బయిన వైద్యప్రస్తారమను గ్రంథంబు
సర్వంబును సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

1684



1684

1684

END OF
TITLE